క్లుప్తంగా

498 మంది రఘు విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన మెగా రక్తదాన శిబిరంలో 498 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, విజయనగరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు సహాయ సహకారాలు అందించారు. రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, కరస్పాండెంట్ రమాదేవి విద్యార్థులకు మొమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విజయకుమార్, జగదీష్ పండా, డీన్ సతీష్ చౌదరి, ఎన్‌సీసీ అధికారి కృష్ణకిషోర్, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కె.దివ్యవర్షిణి, ఎం.రాము, కళాశాల ప్రతినిధి వి.సోమశేఖరం పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటీలో ముగిసిన జాతీయ సదస్సు



విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్ భాస్కర్

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్పాన్సర్ చేసిన వాణి ప్రాయోజిత రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. భువనేశ్వర్‌కు చెందిన స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్సెస్ ఆఫ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ కరంకి శ్రీనివాస్ భాస్కర్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ఫర్ హైబ్రిడ్ స్టోరేజ్ సిస్టమ్ ఇన్ డీసీ గ్రిడ్ గురించి ప్రసంగించారు. నగరానికి చెందిన టెకీబోట్ సీఈవో నల్లమిల్లి వెంకటరెడ్డి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సనపల రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు పరిశోధన, నాణ్యత, విస్తరణ, ఇన్నోవేటివ్ ఐడియాలు పంచుకున్నారు. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, కో ఆర్డినేటర్ ఆర్ఎస్ఆర్ కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా ఎంసీఏ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులను మైక్రాన్ సంస్థ భారీ వేతనాలతో ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఎంసీఏ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఎస్.లహరి మోహన్, ఎం. వర్షిణి, పి. భవాని, కె. హర్షవర్ధన్ రెడ్డి, ఎన్.మనోజ్‌లకు 12.26 లక్షల వార్షిక వేతనంతో మైక్రాన్ సంస్థకు ఎంపికయ్యారు.

అనంతుని ఆలయానికి మైక్ సెట్ బహూకరణ



అనంతుని ఆలయంపై ఏర్పాటు చేసిన మైక్ సెట్

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయానికి మద్ది గ్రామానికి చెందిన కాళ్ల వెంకట సత్యనారాయణ శుక్రవారం మైక్ సెట్ బహూకరించారు. దీన్ని ఆలయంపై ఏర్పాటు చేశారు.

దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమార్చన, అన్నదానం



దుర్గాలమ్మ ఆలయంలో అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు చేశారు. పరిసర ప్రాంతాల మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం చంద్రంపాలేనికి చెందిన జగ్గుపిల్లి అప్పారావు, లక్ష్మి దంపతులు 3 వందల మందికి అన్నప్రసాదం అందించారు. సాయిప్రియ గార్డెన్ వాస్తవ్యులు వెంకటరమణ రాజు, అనిత పులిహోర, ఇతర ప్రసాదాలను అమ్మవారికి నివేదించి, పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనుచూపు మేర ఎక్కడ చూసినా పచ్చదనంతో పుడమి తల్లి పచ్చని చీర కట్టిందా అన్నట్లు కనువిందు చేసే ఆ దృశ్యం కనుమరుగైపోతోంది. కలుషిత జలానికి మూగజీవులు బలైపోతున్నాయి. విషరసాయనాలు ఓ వైపు పచ్చదనాన్ని హరిస్తుండగా.. మరోవైపు కాలుష్య కోరల్లో చిక్కుకుని సుమారు 15వేల మంది వ్యాధుల బారిన పడుతున్నారు. పది గ్రామాల ప్రజలను వేధిస్తున్న ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం వహించడం ఇక్కడి ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తోంది.



నురుగలు కక్కుతున్న కలుషిత నీరు

చేపల మృత్యువాత



కాలుష్యానికి మృత్యువాత పడిన చేపలు

కలుషిత జలం నేరుగా చెరువులు, గెడ్డల్లోకి చేరడంతో భారీ స్థాయిలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల కాలుష్యం అధికంగా ఉండడంతో ఒక్కసారిగా వందలకొద్దీ చేపలు మృత్యువాత పడి, నీటిలో తేలియాడుతూ స్థానికులను ఆందోళనకు గురిచేశాయి. ఇదే కలుషిత నీరు నేరుగా సముద్రంలో కూడా కలుస్తోందని, దీనివలన చేపలుప్పాడ, మంగమారిపేట ప్రాంతాల్లో మత్స్య సంపద క్రమేణా తగ్గిపోతోందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సీ ఫుడ్ కంపెనీ వ్యర్థాలతో చెరువుల్లో నీరు కలుషితం
- మృత్యువాత పడుతున్న చేపలు
- తాగునీటికి అవస్థలు
- వ్యాధుల బారిన గ్రామస్తులు
- కనుమరుగవుతున్న పచ్చదనం

కాలుష్య కోరల్లో గ్రామాలు

కొమ్మాది: జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో రెండు రొయ్యపిల్లల కేంద్రాల (సీ ఫుడ్స్) కంపెనీలు వదులుతున్న విష రసాయనాలు, ఫిల్టర్ చేయని వ్యర్థాలు నేరుగా కాలువల్లోకి వదలడంతో ఆ కలుషిత నీరు గెడ్డలకు చేరుతోంది. అక్కడి నుంచి నేరుగా పొలాల్లోకి చేరి, పంటపొలాలను నాశనం చేస్తోంది. దీనివలన పొలాల్లో దిగుబడి తగ్గడంతో పాటు, పంటల్లో నాణ్యత లోపిస్తోంది. ఇక్కడ పండించిన పంటలను కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడ, సోమన్నపాలెం, రెడ్డిలపాలెం, కె.నగరపాలెం ప్రాంతాల రైతులను ఈ సమస్య ఏళ్ల తరబడి వేధిస్తోంది.

కలుషితమవుతున్న నీరు

సీ ఫుడ్ కంపెనీలు రసాయనాలు వాడిన వ్యర్థాలను, నీటిని నేరుగా కాలువల్లోకి విడుదల చేయడంతో విషతుల్యమైన ఆ నీరు మారికవలస నుంచి పాత పరదేశిపాలెం, బోయపాలెం, కాపులుప్పాడ ప్రాంతాలకు సంబంధించిన కాలువల్లో కలసి, ఇక్కడి చెరువుల్లోకి చేరుతోంది. వీటివల్ల రాజుగారి చెరువు, కంబాల చెరువు, బాడవ చెరువు, గోస్తని చెరువు (గంభీరం గెడ్డ) లలో ఈ రసాయనాలు కలవడంతో ప్రస్తుతం ఈ చెరువులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. పైగా తీవ్రమైన దుర్వాసన సెగలు కక్కుతోంది. ఈ ప్రాంతాల్లో సుమారు 90 ఎకరాల భూమిలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ చెరువుల నుంచి వచ్చే నీటితో పంటపొలాలను సాగు చేసేవారు. ఈ కలుషిత జలం చెరువుల నుంచి నేరుగా ఈ పొలాల్లోకి చేరుకోవడంతో వ్యవసాయం దిగుబడి తగ్గి, వందలాది రైతు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

గ్రామాల్లో దుర్గంధం

ఈ కలుషిత నీరు నేరుగా కాలువల్లో చేరడంతో దుర్గంధం భరించలేకపోతున్నామని గ్రామాల్లో ప్రజలు వాపోతున్నారు. వీటి వలన చర్మవ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు. దోమలు, ఈగలు బాగా ఎక్కువగా ఉంటున్నాయని, తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. ఆ కంపెనీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మారికవలస, తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పొల్యూషన్ బోర్డు సభ్యుడెక్కడ?

పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు, జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన పంచకర్ల సందీప్ కూడా కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు, మూగజీవులకు, ప్రకృతికి ఇంత నష్టం వాటిల్లుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా బోర్డు సభ్యులు ఈ ప్రాంతాలను పరిశీలించి, సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరింత నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.

పంటల దిగుబడి తగ్గిపోతోంది



మూడు పంచాయతీల్లో సుమారు 90 మంది రైతులం వ్యవసాయం చేసుకుంటున్నాం. కలుషితమైన నీరు మా పొలాల్లోకి రావడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దుర్గంధం భరించలేక వ్యవసాయం చేయలేకపోతున్నాం. ఈ పంట తినాలన్నా భయంగా ఉంటోంది. నీరు లేక, చెరువులో నీరు కలుషితమై, ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాం.

– నాగోతు సింగన్న, రైతు, కె.నగరపాలెం

గెడ్డలు చూస్తే తీవ్రత తెలుస్తుంది



మా ప్రాంతంలో కాలుష్యం ఎంత తీవ్రంగా ఉందో నురగలు కక్కుతున్న గెడ్డ ప్రాంతాలను చూస్తేనే తెలుస్తుంది. చేపలు చచ్చిపోతున్నాయి. ఇవన్నీ కాలుష్య తీవ్రతకు నిదర్శనాలే. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. తక్షణ చర్యలు తీసుకుని మా ఆరోగ్యాన్ని రక్షించాలి.

– కోడిబోయిన వరహాలు, గొల్లలపాలెం

కమిటీ వేసి చర్యలు తీసుకోవాలి



కలుషిత నీరు నేరుగా చెరువుల్లోకి రావడంతో చుట్టూ ఉన్న ప్రాంతమంతా దుర్గంధమే. పైగా శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నీటిలో రసాయనాలు కలవడంతో చర్మవ్యాధులు, దద్దుర్లు వస్తున్నాయి. అధికారులు స్పందించి, కమిటీ వేసి చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలి.

– దేవాడ నాయుడు, రెడ్డిలపాలెం

రోగాల బారిన పడుతున్నాం



ఐదో వార్డులోని రెండు సీ ఫుడ్ కంపెనీలు వాడుతున్న రసాయనాల వల్ల చాలా మంది రోగాల బారిన పడుతున్నారు. తాగు నీరు కూడా కలుషితమవుతోంది. ఇలాంటి కంపెనీలను నివాసాలకు దూరంగా ఏర్పాటుచేయాలి.

– వాండ్రాసి సన్యాసిరావు, కె.నగరపాలెం



పైపుల ద్వారా విడుదల అవుతున్న కలుషిత జలం



పంటపొలాల్లోకి చేరుతున్న కలుషిత జలం

పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలి

- భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్
- స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: విద్యార్థులు క్రమశిక్షణతో చదువులు, ఆటల్లో పోటీపడాలని, దేశసేవకు పాటుపడుతూ మేటిగా నిలవాలని భీమిలి ఆర్డీవో సంగీత్‌మాథూర్ ఆకాంక్షించారు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో తృతీయ సోపానం శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. 8,10 తరగతులను సందర్శించి సిలబస్‌లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ తరగతి గదులు, కంప్యూటర్లు, ల్యాబ్ , గ్రంథాలయం, హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పాఠశాలలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరు సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవులైన కబీర్, రహీమ్, తులసీదాస్, సూరదాస్, మీరాబాయి తదితరుల వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా థింసా తదితర నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థులను హిందీ ఉపాధ్యాయుడు గుప్తా , ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మ ఆశీర్వాదం సర్వ జనావళికి అవసరం



చిట్టివలస కార్మికవాడలో ఉత్సవ రాట వేస్తున్న సిరి సహస్ర

తగరపువలస: అమ్మ ఆశీర్వాదం సర్వ జనావళికి అవసరమని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర అన్నారు. చిట్టివలస కార్మికవాడలోని నీళ్ల ట్యాంక్ వద్ద నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం నిర్వహించిన రాట ఉత్సవంలో ఆమె పాల్గొన్నారు. నిష్కలష్మంగా, నిండు భక్తితో అమ్మకు పూజలు చేస్తే ఆశీర్వాదాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రంగూరి సీతారామదొర, రిటైర్డ్ డైట్ అధ్యాపకుడు అలంక సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, నాయకులు దుంప సాయిరెడ్డి, దుంప రాంబాబు, కుంచా శివరామకృష్ణ, చింతగుంట శివ, రొక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- చిట్టివలస గణేష్ థియేటర్ కూడలి వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాట వేశారు.

మధురవాడ టైలర్స్ కాలనీలో..

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో కొలువైన విజయదుర్గా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఆలయం వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ధర్మకర్త దంపతులు బంగారు సుబ్బారావు, లక్ష్మి దంపతులు, నాయకులు ఉత్సవరాట వేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బంగారుప్రకాశ్, వైఎస్సార్‌సీపీ 5, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, సాంస్కృతి విభాగం అధ్యక్షుడు వంకాయల మారుతీ ప్రసాద్, పోతిన చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం: వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉండాలన్నారు. ముందుగా ఆమె పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో పరీక్షించారు. ఇదే గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు పౌష్టికాహారం సరిగా అందిస్తున్నారా? లేదా ఆరా తీశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, ఎంఈవో పి.రమణ, ఆర్ఐ శ్యామల, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



హెచ్‌బీ కాలనీలో రోడ్డుపై నిలిచిపోయిన వాన నీరు

పీఎం పాలెం: పీఎం పాలెం పరిసర ప్రాంతాలో శుక్రవారం కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. ముఖ్యంగా రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీలోని అంతర్గత రహదారులకు చాలాకాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో, గుంతలు ఏర్పడి వాననీరు నిలిచిపోతోంది. సరైన డ్రైనేజీ సదుపాయం లేక, చిన్న వాన కురిసినా ఎక్కడి నీరు అక్కడే స్తంభించిపోతోంది. వాన వెలిసిన రెండు, మూడు రోజులైనా ఆ నీరు అలాగే ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు





నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వద్ద రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాల కళా ఉత్సవ్ పోటీలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం నిర్వహించిన పోటీలకు 25 పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. సంప్రదాయ కథలు, నాటికలు, చిత్రలేఖనం తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందించారు, ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో అందరూ ఎంతో సరదాగా పాల్గొన్నారని, ఇలాంటి పోటీలు విద్యార్థులకు మంచి స్ఫూర్తిని ఇస్తాయని అన్నారు. ఎక్కడ, ఏ పోటీలు జరిగినా పాల్గొనడం ద్వారా ప్రతిభ, విజ్ఞానం మరింత వికసిస్తాయని, ఇవి వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. దీనివల్ల తమ ప్రాంతాలకు, పాఠశాలలకు మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.జి.ఎస్.నాగేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లంకిలో మండల ప్రత్యేకాధికారి పర్యటన

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలో మండల ప్రత్యేకాధికారి కె.రామారావు పర్యటించారు. ముందుగా బొడ్డపాలెంలోని హౌసింగ్ లేఅవుట్‌ను తనిఖీ చేశారు. అసంపూర్తిగా నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు తీసుకుని, త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించా రు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, మెనూ అమలుపై ఆరా తీశారు. వెల్లంకి సచివాల యంలో సిబ్బంది పనితీరుపై సమీక్ష జరిపారు.డి ప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ శ్యాంసుందర్, ఎంఈవో గంగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి ఉన్నారు.

కారు బీభత్సం

- బైక్‌కు డ్యాష్ ఇచ్చి, డివైడర్‌పై స్తంభాన్ని, చెట్టును ఢీకొన్న కారు
- ద్విచక్ర వాహనచోదకుడికి గాయాలు



డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

మధురవాడ: అతి వేగంగా వస్తున్న కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనానికి డ్యాష్ ఇచ్చి, అదుపు తప్పి డివైడర్‌పై స్తంభాన్ని ఢీకొంది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో తీవ్ర భయాందోళనకు గురి చేసిన సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.. తిమ్మాపురం వద్ద ఫిల్మ్ క్లబ్ నుంచి మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ వైపు వస్తున్న కారు అతి వేగం వలన అదుపు తప్పింది. ఈ క్రమంలో మధురవాడ వుడా హరిత ప్రాజెక్టు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని సైలెన్సర్ వద్ద డ్యాష్ ఇచ్చింది. దీంతో ద్వి చక్రవాహనం ఎగిరి పడింది. దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన తర్వాత కారు అదుపు తప్పి మాస్టర్ ప్లాన్ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఎక్కించి సుమారు 50మీటర్ల వరకు వెళ్లి సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని, చెట్టును ఢీకొట్టి ఆగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం బాగా దెబ్బతింది. ఇందులో యువతీ యువకులు ఉండగా యువకులు మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పైగా కారును కదపలేని పరిస్థితిలో ఉండడంతో ప్రమాదానికి గురైన కారులో ఉన్న మద్యం, గ్లాసులు, ఇతర సామగ్రిని దాని వెనుక వచ్చిన వేరే కారులోకి తరలించారు. వీరు ఫిల్మ్ క్లబ్‌కు వెళ్లి మధురవాడ వైపు వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. అతి వేగం, నిర్లక్ష్యంగా కారును నడపడం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. డ్రైవ్ చేసిన యువకుడు కనపడకుండా పోవడంతో పరారీలో ఉన్నాడా, లేక ఆస్పత్రికి వెళ్లి ఉంటాడా అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను జిల్లా తనిఖీ అధికారి ఉషారాణి శుక్రవారం పరిశీలించారు. చెత్త సేకరణలో లోపాలను గమనించి సూచనలు చేశారు. చెత్తను వేరువేరుగా సేకరించి, తరలించాలని సూచించారు. పంచాయతీ, సచివాలయాల సిబ్బంది నిరంతరం ఈ కేంద్రాలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయుల వినతి



తహసీల్దారు రామారావుకు వినతిపత్రం అందిస్తున్న టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు

భీమునిపట్నం: ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ భీమిలి మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దారు రామారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఎల్.మహాలక్ష్మినాయుడు, అర్బన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్.కోటేశ్వరరావు,జిల్లా కార్యవర్గ సభ్యుడు దాలయ్య బాబు, సభ్యులు పాల్గొన్నారు.